GOVERNMENT DEGREE COLLEGE, ETURNAGARAM, DIST : MULUGU

# JIGNASA 2019-20

## A Student Study Project

Conducted Under the Jurisdiction of Commissioner of college Education, Telangana State

DEPARTMENT OF TELUGU

## Topic: డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలు- వ్యక్తిత్వ నిర్మాణం

## Synopsis :

విద్యార్థుల జీవితాల్లో పట్టభద్ర దశ అతి కీలకమైంది. కావున డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలు విద్యార్థులమైన మాకు మానవీయ విలువలు, భావనా శక్తి, మనో వికాసమ్, విచక్షణ జ్ఞానం పెంపొందించే విధంగా పాఠ్యాంశాలు ఉన్నాయనేది మా పరిశోధనలో తేలింది. అట్లాగే విద్యార్థులలో ఆత్మస్థైర్యం, పట్టుదల , త్యాగబుద్ధి ఈ అంశాన్ని వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడే విధంగా పద్యాలు ఉన్నాయి అని మేము గ్రహించే విధంగా పై అంశాలన్ని మాలో అలవర్చుకోవడానికి ఉపయోగపడే విధంగా ఉన్నాయి. ఇలా శకుంతలాపాఖ్యానంలో మేము విశ్లేషణ చేసిన అంశాలు. అనాథలుగా మారడానికి గల కారణాలు మరియు ఆత్మస్థైర్యం , పుత్రుని ప్రాధాన్యత, భార్య ప్రాధన్యత, కుటుంబ ప్రాధాన్యత, మాతృ ప్రేమ, సత్యవాక్య ప్రాధాన్యత అనే అంశాలను మేము గ్రహించాము. గొడగూచి పాఠ్యాంశము నుంచి పట్టుదల, శిశు మనస్తత్వం త్యాగనిరతి పాఠ్యాంశం నుండి త్యాగబుద్ధి మరియు ఊహాశక్తిని గ్రహించాము.

సంవరణుడి తపస్సు నుంచి క్రమశిక్షణ, ఏకాగ్రత, మానసిక స్థితిని నిలుపుకోవటం, సమయస్ఫూర్తి, పట్టుదల మొదలగు అంశాలను గ్రహించాము. సుభాషితములు నుండి మూర్ఖుని పట్ల అవగాహన, ఓర్పు, మాట నేర్పరితనం లను గ్రహించాము. కాసులు పాఠ్యాంశం నుంచి ప్రేమ తత్వాన్ని గ్రహించాము. రాజు-కవి నుంచి కవి గొప్పతనం, జ్ఞానాన్ని పెంపొందించే పద్యాలను గ్రహించాము. గంగిరెద్దు పాఠ్యాంశం నుంచి మాట నేర్పరితనం మరియు ఇతర జంతువుల ఆదారముగా మానవుల సహజీవన సంస్కృతిని మేము గ్రహించాము. ధర్మజుని వాక్చాతుర్యం నుంచి మాట నేర్పరితనం, నైతిక విలువలు, ఆత్మస్థైర్యం మొదలగు అంశాలను గ్రహించాము.

విబీషణ శరణాగతి నుంచి రాజనీతి , తొందరపాటు ఉండకూడదు అనే అంశాలు గ్రహించాము. గుణనిధి కథ నుంచి దుర్వ్యసనాలకు పాల్పడిత చివరికి ఏమి జరుగుతుందో గ్రహించాము. నారద గానమాత్సర్యం నుంచి పోటివల్ల విద్య వర్ధిల్లుతుంది అనే అంశాన్ని మేము గ్రహించాము. నివురు తొలగిన నిప్పు ద్వారా ఆత్మ విశ్వాసం మరియు విద్యార్థులకు స్ఫూర్తి నిచ్చే విధంగా ఉంది. ఈ విధంగా పై అంశాలన్ని విద్యార్థులకు , పాఠకులకు వ్యక్తిత్వ నిర్మాణం పెంపొందించే విధంగా డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలు అన్ని ఉన్నాయని మా పరిశోధన ద్వారా , విషయ విశ్లేషణ ద్వారా గ్రహించాము.

GOVERNMENT DEGREE COLLEGE, ETURNAGARAM, DIST : MULUGU

# JIGNASA 2019-20

## A Student Study Project

Conducted Under the Jurisdiction of Commissioner of college Education, Telangana State

## తెలుగు విభాగము

## Topic: డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలు- వ్యక్తిత్వ నిర్మాణం

**Conducted by students**

1. S. Raj kumar - B.Com II Year
2. J. Ravinder - B.Com II Year
3. A. Usha - B.SC ( MPC ) I Year
4. S. Lavanya - B.Sc ( MPCS ) II Year
5. T. Poojitha - B.A II Year

Supervision by

**Dr. B. Ramulu**

Lect. In Telugu

**Ch. Gopal**

Lect. In Telugu

## విషయసూచిక

1. పరిచయం

2. శకుంతలో పాఖ్యానము - నన్నయ్య

3. గొడగూచి కథ - పాల్కురికి సోమనాథుడు

4. త్యాగనిరతి – కొరవి గోపరాజు

5. సంవరణుడి తపస్సు - అద్దంకి గంగాధరుడు

6. సుభాషితములు – ఏనుగు లక్ష్మణ కవి

7. కాసులు - గురజాడ అప్పారావు

8. రాజు- కవి - డా. గుఱ్ఱం జాషువా

9. గంగిరెద్దు – డా. పల్లా దుర్గయ్య

10. ధర్మజుని వాక్చాతుర్యం – తిక్కన

11. విభీషణ శరణాగతి – గోన బుద్ధారెడ్డి

12. గుణనిధి కథ – శ్రీనాథుడు

13. నారధ గానమాత్సర్యం – పింగళి సూరన

14. నారసింహా శతకం – ధర్మపురి శేషప్ప కవి

15. నివురు తొలగిన నిప్పు – పోల్కంపల్లి శాంతాదేవి

16. ముగింపు

Topic : డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలు - వ్యక్తిత్వ వికాసం

## పరిచయము :

విద్యార్థుల జీవితాల్లో పట్టభద్ర దశ అతి కీలకమైనది. విశాలమైన భవిష్యదారణకు ఇది ప్రవేశ ద్వారం వంటిది. తెలుగు విషయానికి వస్తే ఇది మాతృ భాష. తల్లి భాషను విస్మరిస్తే తల్లిని నిర్లక్ష్యం చేసినట్టే అవుతుంది. స్వభాష వచ్చిన వాడికి అన్య భాషలు నేర్చుకోవడానికి సులువుగా ఉంటుంది. అట్లాగే డిగ్రి తెలుగు పాఠ్యాంశాల విషయానికి వస్తే ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, కథానిక, వ్యాసం వంటి వర్తమాన ప్రక్రియలు కూడా వీటిలో ఉన్నాయి. పాఠ్యాంశాల ఎన్నికలో నాణ్యతతో పాటు మానవీయ విలువలు , భావనశక్తి, మనోవికాసం, విచక్షణ జ్ఞానం విద్యార్థులకు అందించాలన్న దృష్టితో సంపాదకులు పాఠ్య ప్రణాళిక రచించారు.

ఆత్మస్థైర్యంతోఉండటం అనుకున్నది సాధించటం, పరోపకారం కోసం త్యాగబుద్ధి ఉండాలనే సూచన. వ్యక్తిత్వనిర్మాణానికి తోడ్పడే ఆణిముత్యాల్లంటి పాఠ్యాంశాలు శతక పద్యాలు ప్రేమకు లోతైన నిర్వచనం చెప్పటంలో కాసులు కవిత సామాజిక శ్రేయస్సు కోసం కవి భాగస్వామ్యం. రాజుకన్నా కవే గొప్పవాడు అనే సాత్విక భావనను మాకందించిన సంపాదకులకు ధన్యవాదాలు.

## శకుంతలోపాఖ్యానము :

విశ్వామిత్రుని తపోభంగం మేనక లక్ష్యం. కావున ఈ సందర్భంలో విశ్వామిత్రునికి , మేనకలకు శకుంతల జన్మించింది. తదనంతరం మేనక తన దారిన తాను వెళ్తుంది. విశ్వామిత్రుడు మళ్ళీ తపస్సులో మునిగాడు. శకుంతల అనాథగా మారింది. శకుంతలను కణ్వుడు చేరదీశాడు. అంటే దీనిని బట్టి చూస్తే ప్రాచీనం నుండి ఈ కాలం వరకు అదే తీరు అన్నట్లు నేడు చెప్పుకుంటున్న ప్రేమ అనే పేరుతో పెళ్ళి కాకుండానే పిల్లల్ని కని చెట్ల పొదలలో , చెత్త కుండిలలో విడిచిపెట్టడం . ఆ పిల్లలు అనాథలుగా మారటం అనేది నేటికి ఉన్నాయనే విషయం గమనించవచ్చును. ఈ నాటి అనాథలకు ఆనాటి శకుంతల ప్రతీక.

శకుంతల కూడా తెలిసి తెలియని వయస్సులో దుష్యంతునికి ఆకర్షితురాలై ప్రేమలో పడి సర్వదమనునికి జన్మనిస్తుంది. దుష్యంతుడు ఆమెను విడిచి వెళ్ళడంతో దుష్యంతుని వెతుక్కుంటూ వెళ్ళడం . నేడు కనిపిస్తున్న ప్రియురాలిని ప్రేమ పేరుతో మోసం, ప్రియుడు ఇంటి ముందు ధర్నా. ఇలాంటి చిత్రాలు మన కళ్ళముందే కనిపిస్తున్నాయి. శకుంతల దుష్యంతుని సభకు వెళ్ళడం.

దుష్యంతుని సభకు వెళ్ళిన శకుంతలను తిరస్కరించి తనెవరో తెలియదని స్వయంగా దుష్యంతుడే చెప్పినా శకుంతల ఆత్మస్థైర్యం కోల్పోకుండా తన వాదన వినిపించిన శకుంతల పాత్ర నేటి విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని చెప్పవచ్చును.

శకుంతల తన వాదన వినిపించే ప్రయత్నంలో భాగంగా

❖ విమల యశోనిధీ !పురుష వృత్త మెఱంగు చునుండుఁజూవెవే
దములునుఁబంచ భూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముడునుఁజంద్ర సూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థము లివియుండఁగా నరుఁడు దక్కొననేర్చునే తన్నుమ్రుచ్చిలన్

మొదలైన పద్యాలలో నరుడు తనను తాను మోసం చేసుకోలేడని వేదాలు, పంచభూతాలు మొదలైన ప్రకృతి శక్తులు మనుషులు చేసే పనులను కనిపెడతాయనే కాకుండా భార్య ప్రాధాన్యం, కుటుంబ ప్రాధాన్యం, పుత్ర ప్రాధాన్యం, సత్య వాక్యం యొక్క గొప్పతనం మొదలైన అంశాలను సభలోని అందరి ముందు పేర్కొని ఆకాశవాణే యే స్వయంగా తనకు సాక్ష్యం వచ్చేటట్లు చేసుకోగల్గింది. ఆనాటి శకుంతల చూపిన ధైర్యం వాక్పటిమ తన గురించి కాకుండా తన మాటలలో కేవలం తన కుమారుడుని " యువరాజు " గా ఉంటే చాలు అని మాతృ ప్రేమ గొప్పతనాన్ని తెలియజేసింది.

ఈ నాటి విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి ప్రేరకాలుగా కనిపిస్తాయి.

## గొడగూచి కథ:

గొడగూచి ఒక చిన్న బాలిక . అమాయకత్వంతో అనుకున్నది సాధించాలనే క్రమంలో గొడగూచి శివునికి పాలు త్రాగించడానికి చేసే ప్రయత్నంలో భాగంగా శివుడికి ఆకలిగా లేకపోతే గ్రుక్కడైనా త్రాగి తనకు మిగల్చమంది. పాలు ఎందుకు ఆరగింపడం లేదూ అని పాలు కాచడం సరిపోలేదా ? కమ్మటి వాసన వేయడం లేదా ?పాలు విరిగి పోయాయా ? పాలు పరిశుద్ధమైనవి కావా ? నేను చిన్న పిల్లననా ? ప్రొద్దెక్కిందా ? పాలు తేవడం ఆలస్యమయిందా ? త్రాగాలని బుద్ధి పుట్టడం లేదా ? నెయ్యి పోయకుండా ఉన్నానా ? బాగా వేడిగా ఉన్నాయా ? పాలలో నీరు కలిసాయనా ? నీవు అకారణంగా పాలు త్రాగటానికి ఎందుకు ఇష్టపడుట లేదు అని ప్రశ్నిస్తూ గుజ్జుగా కలిపిన అన్నం ఒక గిన్నెడు తీసుకు

రమ్మంటావా ? ఇంటి దగ్గర పొంగరాలు, కుండెడు నెయ్యి, పటిక బెల్లము ఉన్నవి.

కావాలంటే చెప్పు తీసుకువస్తాను అని అడుగుతుంది. పాయసం ఉంది తెస్తాను ముందు పాలు త్రాగు అని పోడశ పండుగ చూడటానికి వెళతాము. చక్కగా ఈ పాలు త్రాగు అని వీరభద్రుని జాతరకు తీసుకెళ్తానని ఈ పాలలోకి అటుకులు తీసుకువస్తానని ఆడుకోవడానికి చిన్న పాత్రలు , చిన్న బొమ్మలు, ఎన్నో పళ్ళూ నాకు రేపు మా వాళ్ళు తీసుకువస్తారు. అవి నీకు తెచ్చి ఇస్తానని ఈ విధంగా ఆ బాలిక శివునకు చాలా సార్లు నమస్కరించింది. శివున్ని కోపించింది. దుమికింది, అరచింది, ఏడ్చింది, బుజ్జగించింది. ఈ విధంగా గొడగూచి ద్వారా శివున్ని మెప్పించే మాట నేర్పరితనం అనుకున్నది సాధించాలనే పట్టుదల గొడగూచి పాత్ర ద్వారా విద్యార్థులు గ్రహించవచ్చును. అలాగే శిశు మనస్తత్వాన్ని విద్యార్థులు గ్రహిస్తారు.

## త్యాగనిరతి :

క. నడుమం గృష్ణుఁడు గలపా
ల్కడలిన జనియించి తండ్రికైవడి మూర్తిన్
బెడఁగడరెడువాఁడనఁగా
నుడుపతి తెలుపై కళంకయుతుఁడై మెఱసెన్.

మధ్యలో శ్రీ మహావిష్ణువు ఉండే పాల సముద్రమున పుట్టి తండ్రియైన పాల సముద్రుడి వలె, స్వరూపమునందు , చక్కదనంతో శోభించేవాడు అనేటట్లు చంద్రుడు తెల్లనివాడై కళంకమునూ గలవాడై ప్రకాశించాడు.

పాల సముద్రములో మధ్యన, నల్లని కృష్ణుడు ( విష్ణుమూర్తి ) ఉంటాడు. పాల సముద్రం తెల్లగా ఉంటుంది. నల్లని కృష్ణుడు కల తెల్లని పాల సముద్రములో పుట్టిన చంద్రుడు కూడా తెలుపు, నలుపు కలవాడిగా నల్లదనము, చంద్రునికి వచ్చాయి. ఎందుకంటే చంద్రుడు తెల్లగా ఉంటాడు. పాల సముద్రంలో మధ్యన నల్లని కృష్ణుడు ఉన్నట్లు చంద్రుడిలో నల్లని కళంకము ఉంటుంది. ఈ పద్యము విద్యార్థులలో ఊహాశక్తిని పెంపొందిస్తుంది.

## సంవరణుడి తపస్సు :

నాళీకాప్తుడు గోరగించుటమున్ ప్రత్యూషకాలంబునన్
వాలాయంబుగ పుల్లతామరస భవ్యంబైన శృంగారపుం
గేళాకూళిని దీర్ఘమాడి యనురక్తిన్ ధౌతకాషాయుఁడై
ఫాలాది స్థలులందు నవ్యభసిత ప్రాగల్భ్యమేపారఁగన్

సంవరణుడు సూర్యుడు ఉదయించడానికి ముందే ప్రభాతకాలంలో తప్పనిసరిగా వికసించిన పద్మములతో శుభప్రదమైన , అందమైన క్రీడా సరస్సులో స్నానము చేసి ఆసక్తితో కాషాయ వస్త్రాలను ధరించి నుదురు, చేతులు, రొమ్ము మొదలైన శరీర భాగాలయందు క్రొత్తగా విబూధిని దట్టంగా పెట్టుకునేవాడు. ఈ పద్యం ద్వారా విద్యార్థులు దినచర్యలో భాగంగా ఏదైన పనిని ప్రారంభించడానికి ఒక క్రమపద్ధతిని పాటించడం గ్రహిస్తారు.

ఆ నడబావి దండఁగలయం జిగిరించిన దేవదారుశా

ఖానికరంబు క్రిందట నొకానొకచోఁగురువింద తీవపూఁ

బానుపుటింటిలోన వనపాలుర కెవ్వరికి న్నుండుంగఁగా

రాని ప్రదేశమందున ధరాధిపుఁడొంటి సమాధినిష్ఠుఁడై

ఆ దిగుడు బావి సమీపంలో సంవరణుడు తపోభంగం కలగకుండా చేసుకున్న ఏర్పాట్లు విద్యార్థులు గ్రహిస్తారు. దీని ద్వారా విద్యార్థులమైన మేము చదువుకునేటపుడు ఎలాంటి ఏకాగ్రతకు భంగం కలగకుండా మానసికస్థితిని నిలుపుకొనుటకు ఈ పద్యం ప్రేరణ కల్పిస్తుంది.

అర్థోదయావసరమున

వార్ధిగభీరుండు సంధ్యవార్చెనుదిమిరాం

తర్ధవళ తారకాళీ

స్పర్థాళు శిరోరుహాగ్ర జలకణయుతుఁడై

ఈ పద్యంలో సంవరణుడు పూర్తిగా ఉదయించకముందే స్నానం చేసి తల నీళ్ళు ఇంకా జారుతూ ఉండగానే సంధ్యా వందనం చేశాడు. అంటే సంవరణుడు సమయపాలన పాటించడాన్ని విద్యార్థులమైన మేము గ్రహించి సమయపాలన పాటించాలనే జ్ఞానం కలిగింది. అలాగే తల వెంట్రుకలను చీకటితోను పోలుస్తూ, తల వెంట్రుకల చివరల నుండి జారుతున్న నీటి బిందువులను నక్షత్రాలతో పోల్చిన కవి వర్ణనను గ్రహించాము.

విరహభరమున నరపతి వివశుఁడగుచు

వేదజననియైన్రి గాయత్రి వెసఁబఠించు

నిశ్చలంబుగఁ దలపోయు నీరజాప్తు

సుఖము దు:ఖంబు కార్యార్థి చూడఁడెందు

తపతీ వియోగ భారముతో సంవరణుడు ఒడలు తెలియక, వేదములకు తల్లియైన గాయత్రీ మంత్రాన్ని శీఘ్రముగా పఠించేవాడు. పద్మబంధునైన సూర్యుడిని నిశ్చలంగా ధ్యానించేవాడు. కార్యార్థి, ఎక్కడా సుఖ:, దు:ఖాలను పట్టించుకోడు. ఈ పద్యంలో సంవరణుడు వ్యక్తిగత జీవితంతో పాటు వృత్తి దర్మానికి ( రాజ దర్మానికి ) విఘాతం కలిగించని సంవరణుని తత్వం విద్యార్థులకు మంచి సందేశం. అట్లాగే పట్టుదలతో శ్రమిస్తే దేనినైనా సాధించవచ్చు అనే విషయాన్ని కూడా గ్రహిస్తారు. ప్రేమించిన అమ్మాయిని లేవదీసుకపోవటం వంటి అమ్మాయి తల్లి దండ్రులతో మెప్పించి చేసుకుంటే బాగుంటుదని గ్రహిస్తారు.

కం. కమలవనీ బాంధవునకు
నమరావతిలోనఁ దగిన యల్లుఁడులేమిన్
గ్రమమున ధరణీతలమున
నెమకంగా దొరకకుండునే యనుబుద్ధిన్

చిలుక తనపై ఉన్న తపతి ప్రేమ బంధాన్ని చూసి సంతోషము, భయము, భక్తి మనస్సులో అధికం కాగా ఇలా చెప్పింది (ముందు పద్యంతో అన్వయం ) సూర్యునకు అమరావతి నగరంలో తగిన అల్లుడు దొరకకపోవడంతో సమర్ధతతో వెదికితే భూ మండలంలో దొరకకపోడనే బుద్ధితో వెళ్ళాను అని చిలుక చెబుతుంది. చిలుక మాటలు ద్వారా వ్యక్తికరణలో నవ్యతను విద్యార్థులుగా మేము గ్రహించాము. అట్లాగే చిలుక మాటల ద్వారా భావ వ్యక్తీకరణలో ఉన్న చతురతను గ్రహించాము. తపతీ సంవరణుల ప్రేమను సూర్యుడు ఒప్పుకున్నడన్న మాటను చిలుక చెప్పకనే చెబుతుంది అని మేము గమనించాము. ఈ పాఠ్యాంశములోని పద్యాలు విద్యార్థులమైన మాకు ప్రేరకాలుగా మాలో ప్రేరణ కల్గిస్తున్నాయి.

## సుభాషితములు :

చ. మకరముఖాన్తరస్థమగు మానికమున్ బెకలింపవచ్చుఁ బా
యక చలదూర్మి కానికరమైన మహోదధి దాటవచ్చు,మ
స్తకమునఁ బూవుదండవలె సర్పమునైన భరింపవచ్చు మ
చ్చిక ఘటియించి మూర్ఖజన చిత్తముఁదెల్పనసాధ్యమేరికిన్

మొసలి నోటిలో నుండి రత్నమును వెతికి బయటకు తీయవచ్చును. మానకుండాకదులుతున్న కెరటములతో నిండిన మహా సముద్రాన్ని కూడా దాటవచ్చును. శిరస్సుపై పూలదండవలె పామునైనా ధరించవచ్చును. కాని ప్రేమతో మూర్ఖుల మనస్సునకు వివరించి చెప్పి వారిని సమాధానపరచటం ఎవరివల్ల కాదు. పై పద్యంలో ఏమి

తెలియని వాడికి ఇతరులు చెపితే వినని వాడికి ఎంత చెప్పిన వ్యర్థమే. అంటే చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు అన్న సామెతను విద్యార్థులు గుర్తుకు తెచ్చుకోవడంతో పాటు మూర్ఖుల పట్ల అవగాహన కల్గి ఉంటారు.

తే.గీ. తివిరి యిసుమునఁ దైలంబుఁ దీయవచ్చుఁ
దవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చుఁ
దిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చుఁ
జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు.

ఇసుకలో నూనె ఉండదు. ఎండమావిలో నీరు ఉండదు. కుందేలుకు అసలు కొమ్ములే ఉండవు. అలా లోకంలో లేనివాటినైనా ఎలాగో కష్టపడి సాధింపగలమేమోకాని మూర్ఖుడి మనస్సు మాత్రం సంతోషపెట్టలేమని భావం. విద్యార్థులు ప్రయత్నించి దేనినైనా సాధించవచ్చునేమో కాని మూర్ఖుల మనస్సుని సంతోష పెట్టడం కోసం చేసే ప్రయత్నాలు వృథా అని గ్రహించి మూర్ఖుల స్వభావమే అంత అనే విషయాన్ని విద్యార్థులు గ్రహిస్తారు. విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి ఇది తోడ్పడుతుంది.

చ. తెలివి యొకింతలేని యెడ దృప్తుఁడనై కరిభంగి సర్వమున్
దెలిసితినంచు గర్వితమతిన్ విహరించితి దొల్లి యిప్పుడు
జ్వలమతులైన పండితుల సన్నిధినించుక బోధశాలినై
తెలియనివాఁడనై మెలఁగితిన్ గతమయ్యె నితాంతగర్వమున్.

ఈ పద్యం ద్వారా విద్యార్థులమైన మేము మూర్ఖులు ఏమి తెలియకపోయిన తెలిసినట్లు గర్వంగా చెప్పుకుంటారు. తనకు తెలిసినంతా ఎవ్వరికి తెలియదనే భ్రమలో వారు విర్ర వీగుతారు. అలాంటి వారికి ఓటమి ఎదురైనపుడు వాని గర్వం తొలిగిపోతుందన్న విషయం విద్యార్థులుగా మేము గ్రహిందాము. ఈ పద్యం విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడుతుంది.

ఉ. ఆపదలందు ధైర్యగుణ మంచిత సంపదలందుఁ దాల్మియున్
భూప సభాంతరాళమునఁ బుష్కల వాక్పటుతత్వ మాజి బా
హాపటు శక్తియున్ యశమునందను రక్తియు విద్యయందు వాం
ఛాపరి వృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్.

ఈ పద్యం ద్వారా విద్యార్థులు ఆపదలందు ధైర్యము, అధిక సంపదలు కలిగినపుడు ఓర్పు, సభా సమావేశాలలో మాట నేర్పరీతనం యుద్ధంలో సమర్థమైన భుజ శక్తియు. కీర్తి ప్రతిష్టల యందు ఆసక్తి. విద్య యందు అధికమైన ఆసక్తులను విద్యార్థిలో పెంపొందుతాయి. ఈ పద్యాలన్నీ విద్యార్థి వ్యక్తిత్వ నిర్మాణాన్ని పెంపొందిస్తాయి.

## కాసులు :

గురజాడ అప్పారావు గారు ఈ కవితా ఖండికలో ప్రేమతత్వాన్ని గూర్చి ఈ విధంగా చెప్పారు.

స్త్రీ, పురుషుల మధ్య అన్యోన్యమైన ప్రేమ ఉండాలని అది లేకపోతే జీవితం వ్యర్థమని తెలియచేశాడు.

ప్రేమ శారీరక పరిధుల్ని దాటి మానసిక ఆవరణలోకి ఎదగాలని తపించిపోయాడు. ఆ తపనలో భాగంగానే ప్రేమికుల మధ్య భార్య, భర్తల మధ్య ఉండాల్సినది ప్రేమ మాత్రమేనని ఆకర్షణ, మోహం కాదని చెప్పాడు.

మరులు ప్రేమని మది దలంచకు;

మరులు మరలును వయ్సు తోడనే

మాయ మర్మము లేని నేస్తము

మగువలకు మగవారి కొక్కటి

బ్రతుకు సుకముకు రాజమార్గము

ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును

ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును.

మోహమే ప్రేమ అనుకోవద్దు. మోహం వయస్సుతో పాటు నశిస్తుంది. ప్రేమ మాయ మర్మం లేని స్నేహితుడు. స్త్రీలకయినా, పురుషులకయినా సుఖంగా బ్రతకాలంటే రాజమార్గం ప్రేమే సుమా ! ప్రేమ ఇస్తే బదులుగా ప్రేమ వస్తుంది. ప్రేమను నిలుపుకుంటే ప్రేమ నిలిచిపోయింది అని విద్యార్థులమైన మేము మా జీవితాల్లో ఈ దశ అతి కీలకమైంది. కావున మేము తప్పుడు దారిలో పోకుండా మానసికస్థితిని నిలుపుకొనుటకు ఈ కవిత్వం ఉపయోగపడుతుంది.

కాసువీసము నివ్వనొల్లక;

కవిత పన్నితినని తలంపకు;

కాసులివె నీ కంఠసీమన

జేరి బంగరు వన్నె గాంచుత !

మగడు వేల్పన పాత మాటది;
ప్రాణమిత్రుడు నీకు, నీవనరు
కలుగకయున్న పేదను; కలిగినను
నాపదవి వేల్పుల రేనికెక్కడ ?

భార్య భర్తల మధ్య గొడవ జరుగుతున్న తీరు సంభాషణలా ఈ కవిత్వం ఉంది. నిజానికి నేడు సమాజంలో గమనిస్తే కనుక భార్య భర్తల మధ్య ఎక్కువగా ఆర్థిక విషయాలలో గొడవలు జరుగుతున్నాయి. కనుక ఆ విధంగా గొడవలు పడకూడదని కలిసి జీవించాలని సందేశమిచ్చే ఈ కవిత్వం . భర్తయే దైవం అనేది పాత మాటని భర్త నీకు ప్రాణ మిత్రుడు అని భార్యల ప్రేమ లేకపోతే పేదవాడినని, ప్రేమ ఉంటే నా పదవి ఇంద్రుని సింహాసనం కన్నా గొప్పదని చెప్పే ఈ కవిత్వం ద్వారా విద్యార్థులమైన మేము ప్రేమ తత్వాన్ని, ప్రేమ గొప్పతనాన్ని గ్రహించాము. భవిష్యత్తులో కూడా భార్య భర్తలకు ఎలాంటి గొడవలు పడకుండా ఉండుటకు ఇది చక్కటి సందేశం.

## రాజు-కవి

తే.గీ. రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజలనాలుకల యందు

ఈ పద్యంలో రాజు చనిపోతే ఆకాశం నుండి ఒక చుక్క రాలిపోతుంది. కనబడకుండా పోతుంది. కాని కవి మరణిస్తే ఆకాశంలో మరొక చుక్క పొడుస్తుంది. ఎప్పటికి ప్రకాశిస్తుంది. రాజు రాతి విగ్రహాల్లో జీవిస్తే, కవి ప్రజల నాలుకలయందు జీవిస్తాడు. అంటె కవి తన రచనల ద్వారా, కావ్యాల ద్వారా, కవిత్వాల ద్వారా ఎప్పటికి జీవించే ఉంటాడని విద్యార్థులమైన మాకు కవి గొప్పతనంతో పాటు జ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఈ రాజు-కవి పద్యాలు ఉన్నాయి.

## గంగిరెద్దు :

వృత్తితో సంబంధం లేకుండా మాట నైపుణ్యంతో తన ప్రదర్శన చూడడానికి వచ్చిన జనుల మనసుని ఆకట్టుకొని వారి నుండి దానాలను గ్రహించే మాట నేర్పరితనం ఈ గంగిరెద్దు పాఠంలోని ప్రతీ పద్యంలో కనబడుతుంది.

ఉదా : పల్లెపల్లెను నూరూర పట్నములను
దొరల దొరసాన్ల పేరు సంతోషపడుచు
చెప్పుకొందును బీదలకెప్పుడేని
యిచ్చినది వ్యర్థముగ బోదు మెచ్చుగనును.

దొరలు మాకిచ్చి వెంటనే మఱచిపోదు
రుతమరెన్నడు మేము మఱవము సామి !
ముష్టివానికి నిచ్చిన పూరిపుల్ల
కూడ బంగారు బిళ్ళయై కూడు పిదప

## ధర్మజుని వాక్చాతుర్యం :

క . ఆపదఁ గడవం బెట్టఁగ
నేపి శుభంబైనదాని నొడఁ గూర్చను మా
కీ పుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా !

మహానుభావా ! కృష్ణా ! మమ్ములను ఆపదలనుండి రక్షించడానికి మాకు శుభములను కలిగించడానికి మా తండ్రి పాండురాజు ఈ జన్మకు మాకు నిన్ను ( రక్షకుడు ) గా చూపించి పోయాడు అని అనటంలో విద్యార్థులమైన మేము ధర్మరాజుని మాట నేర్పరితనంను గ్రహించాము.

శా. ఆ దుర్యోధనుఁడంత మాత్రము జేయంజాలఁడో కాని పెం
పేదఁ గూరతకోర్వరాదు, సిరినాకేలందునే గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నాయరయు నీ చుట్టాలకుం; గావునన్
మోదంబందుట గల్గుఁ గౌరవులునేముంబొంది శ్రీనొందినన్

ఆ దుర్యోదనుడు అంత మాత్రము అయినా చేయగలడో ! లేదో కాని మరీ గౌరవం నశించేటట్లు యుద్ధం చేయడానికి నేను సహింపను. రాజ్యం నా కెందుకు ? అని అనుకుంటున్నావా ? నా గురించి కాదు. నన్ను ఆశ్రయించుకొని ఉన్న ఈ బంధువుల తిండికి, బట్టకు లోటు కలుగుతుంది. ఆశ్రయించిన వారిని పోషించవలసిన బాధ్యత నాకు ఉంది. కనుక సంధి చేసుకోవడం ఎంతయినా అవసరం ఉంది అని ధర్మరాజుని మాట నేర్పరితనంను విద్యార్థులమైన మేము గ్రహించాము.

ఆ. క్షత్త్రధర్మమింత కష్టమగునే ? పెఱ
ధర్మమాచరింపఁ దగ దటండ్రు
గాన శస్త్ర జీవికయ తగియున్నది;
యైన వంశనాశమనభిమతము

క్షత్రియ ధర్మం ఇంత కష్టమా ? యుద్ధం చేస్తే రాజ్యం వస్తుంది. అలాగే వంశనాశనం అవుతుంది. పర ధర్మం ఆచరించడం తగదని పెద్దలు చెప్తారు. కాబట్టి క్షత్రియులైన మాకు ఆయుధంతో జీవించడమే తగినయిన మార్గం కాని వంశము నాశనం కావడం నాకు ఇష్టం లేదు. ఈ పద్యంలో ధర్మరాజు తన ఆత్మస్థైర్యం కనబరిచారు. దీనిని విద్యార్థులమైన మేము ఏది మంచి ఏది చెడు అనే భావనతో పాటు మేము కూడా ఆత్మస్థైర్యంను మాలో అలవర్చుకుంటాము.

చ. తగవునఁ బోకరాజు బెడిదంబులు వల్కినయేని సైఁచియు
ప్పుగనిలుమీ; గురుత్వముఁ బ్రభుత్వమునుఁగల పెద్దవారిమా
టగొనిమి యాసుయోధను కడన్ నిలువన్ మనమెల్ల గారవం
బుగఁగురువృద్ధు పల్కుఁ దలఁ పుం జననిచ్చిన మెచ్చరేజనుల్ ?

కృష్ణా ! ఆ దుర్యోధనుడు న్యాయంగా ప్రవర్తించక పరుషంగా మాట్లాడితే సహించి తొణకకుండా ఉండు. పూజ్యత అధికారం గల పెద్దల మాటలు స్వీకరించక త్రోసిపుచ్చడం. ఆ దుర్యోధనుడు చేసినప్పుడు మనము ఆ కురువంశంలో పెద్ద వారి మాటలను గౌరవించి వారి ఉద్దేశ్యం అని ధర్మజునికి సంధి పట్ల అంచనా అవగాహన కల్గి ఉండటం విద్యార్థులమైన మేము గ్రహించాము.

క. మమ్మెఱుఁ గు దెదికి నెఱుఁ గుదు
నెమ్మి యెఱుఁ గు దర్థసిద్ధి నెఱి యెఱుఁ గుదు వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁ గుదు
వొమ్మెవ్వఁ డ నేను నీకు బుద్ధులు సెప్పన్

శ్రీ కృష్ణా ! నీకు మా గురించి, కౌరవుల గురించి బాగా తెలుసు. స్నేహము, కార్యసిద్ధి, ధర్మమూ నీకు బాగా తెలుసు. సంభాషణ రీతి సంపూర్ణముగా తెలుసు. కాబట్టి వెళ్ళిరా. నీకు ఉపాయాలు చెప్పడానికి, నేను ఎంతటివాడిని ? అని ధర్మరాజు తన మాటల ద్వారా చాతుర్యం కనబరిచారు. విద్యార్థులమైన మేము ఈ పద్యం లోని తెలుగుదనం లక్షణాలను చాతుర్యంను గ్రహించాము. ధర్మరాజు కృష్ణుడికి చెప్పేదంత చెప్పేసి చివరికి మీకు చెప్పేటంత గొప్పవాడను తాను కానని తన వినయాన్ని కృష్ణునిపై గల గౌరవాదరాన్ని, విశ్వాసాన్ని ధర్మరాజు వెలిబుచ్చాడు. దీనిని బట్టి ధర్మరాజు గొప్పమాటకారి అని తెలుస్తుంది.

## విభీషణ శరణాగతి :

" మనదెసనుండుట మానైననీతి "

శ్రీ రాముని శరణుకోరి విభీషణుడు వస్తే రాక్షసరాజు తమ్ముడు విభీషణుడు కావున రాక్షసులను నమ్మరాదని, రాక్షసులు మోసానికి పుట్టినిలు అని మోసం చేయడంలో రాక్షసులను మించిన వారెవ్వరు ఉండరని ఈ నీచుడిని చంపాలి అని సుగ్రీవుడు అనడంలో హనుమంతుడు విని శ్రీ రామునితో తన అభిప్రాయాన్ని ఇలా చెప్పాడు. రావణుని సభలో ఈ విభీషణుడు మనకు అనుకూలంగా మాట్లాడితే అది సహించని రావణుడు ఇతనిని బయటకు తరిమి ఉంటాడు. అందువల్లనే విభీషణుడు వచ్చాడు. ఇదంతా నిజమే కాని మోసము కాదు అని చెప్పెను. అదికాక ఈ విభీషణుడు రాక్షసుల రహస్యాలు తెలిసినవాడు. ఇతడు మన పక్షంలో ఉండటం మంచినీతి అని శ్రీ రామునికి విన్నవించాడు.

ఈ వాక్యంలో రాజనీతి కనబడుతుంది. శరణుకోరి వచ్చిన వారిని రక్షించడం రాజనీతి అని విద్యార్థులు గ్రహిస్తారు. అట్లాగే సుగ్రీవునిలా తొందరపడకూడదు అనే అంశాలు విద్యార్థిలో పెంపొందిస్తాయి.

## గుణనిధి కథ :

పేరుకు వ్యతిరేకంగా నామదేయుడగు గుణనిధి పాత్ర ద్వారా ఉన్నత స్థాయిలో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు దురలవాట్లకు గురైతే వ్యసనపరుడే కాకుండా అతని తల్లిదండ్రులకు కూడా తలవంపులు వస్తాయని గుణనిధి పాత్ర ద్వారా అవగతమవుతుంది.

తన వంశమైన బ్రాహ్మణ జాతి ఆదారాలను పరిహాసం చేయుట అగ్ని సంబంధ కార్యాలకు విముఖంగా ఉండటం సంధ్యాభివందన విషయంలో ఆసక్తి లేకపోవటం పసురు పేది లాంటి వాటితో ఇనుమును బంగారం చేయాలనుకుంటూ కలలు కనే సోమరిపోతులతో స్నేహం చేయటం మొదలైవి. మంచి లక్షణాలు కావని దుర్గుణాలకు నెలవైన గుణనిధి పాత్ర ద్వారా చెప్పాడు కవి.

అతి గారాభం వల్ల సంతానం దుర్వ్యసనాలకు లోనయ్యే అవకాశం ఉంటుందని గుణనిధి తల్లి పాత్ర ద్వారా వివరించాడు కవి.

ఆ. గొడ్డువీఁగి కన్న బిడ్డండు కావున

నెక్కరుండు కాని నుత్పలాక్షి

ధూర్తుఁడైన వాని దుశ్చేష్టితము లెల్ల

నధిపునెఱుఁగ నీక యడఁచుచుండు

ఇటువంటి పద్యాల ద్వార పుత్ర మమకారం అధికంగా ఉండటానికి గల కారణాలు విద్యార్థులమైన మేము గ్రహించాము.

గుణనిధి లేక లేక కలిగిన సంతానం మరియు ఒక్కడే కుమారుడు కనుక అతి గారాభంగా చూడటంతో దుర్వ్యసనాలకు లోనయ్యాడు. పుత్రుని మీద ప్రేమతో తల్లి గుణనిధి తండ్రికి అసత్యం చెప్పాల్సి వచ్చేది అని విద్యార్థులమైన మేము గ్రహించాము. సంతానం దుర్లక్షణాల కారణంగా పెద్దల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకం అవుతుందని

చం. విడువక నీవు పట్టణము వీధుల వెఱ్ఱివాఁడవై
చెడుగులఁ గూడి దౌర్త్యములు సేయ మహీరమణుండెఱింగనే
విడుచును సోమయాజి మనువృత్తులు చేకొనునెల్లభంగులన్
జెడుదుము నీకతంబుననుఁ జీరయుఁణ్ గూడును లేకపుత్రకా !

అనే ఈ పద్యం ద్వారా వివరించారు.

కం. అవినయ నిధానమగు నీ
నవయౌవన శైశవముల నడిమి వయసునం
గవిసెడు వ్యసనోద్రేకం
బవగాఢము దాని మానుమయ్య తనూజా !

వ. మృగయా మద్యపై శున్యవేశ్యా చౌర్య దురోదర పరదారా
భిలాషంబులను దోషంబులు నవయౌవనారంభున
సంభవించె నేని వానిం బరావర్తింప నెవ్వరు నేర్తురు ? గురువచనం
బతి నిర్మలంబయ్యు సలిలంబునుం బోలె శ్రవణ స్థితం బైయభవ్యునికి
శూల పుట్టించు.

వేట, త్రాగుడు, కొంటెగానితనము, వేశ్య, దొంగతనం, జూదము, పర స్త్రీవాంచ అనే వ్యసనాలు యవ్వన దశలో ప్రారంభిస్తే వాటిని మరలించడం ఎవరి వల్ల కాదు. చెడు మార్గాన వెళ్ళేవాడికి యవ్వన దశలో పెద్దలు చెప్పే మాటలు ఎంత సున్నితంగా ఉన్నా అయోగ్యుడికి చెవిలో నిలిచిన నీరు వలెనే పోటు పుట్టిస్తుంది. వేదనను కల్గిస్తుంది అనేవి విద్యార్థులుగా మేము గ్రహించాము. ఇలాంటి పద్యాలు విద్యార్థులు వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడతాయి.

సీ. మధ్యాహ్న సంధ్యాసుమాగమం బిది తీర్థ
మవధరింపుము నిత్యమాచరింపు
మగ్నికార్యముఁ దీర్పు మరవుఁ బూజింపుము
పంచ మహాయజ్ఞపరుఁ డ వగుము
మొగసాల నున్నారు జగతీసుపర్వులు
గ్రాసార్థులగుచుఁ బెక్కండ్రతిథులు
పక్వాన్నములు శాకపాకాదికంబులు
చల్లనాఱినయవిఁ జవులు దప్పుఁ
బదిలముగ మందసమునందు బరిణలోన
నునిచి దాఁచిన దాన మీ యుంగరంబు
దీరదిప్పుడు పెట్టి శోధించి చూడ
నారగించిన పిదప నేనదిప !తెత్తు

మహాప్రభూ ! ఇది మధ్యాహ్న సంధ్యా సమయము మీరు స్నానము చేయాలి. సంధ్యా వందనం చెయ్యాలి. అగ్ని కార్యము తీర్చాలి. శివపూజ చేయాలి. అన్నార్తులై చాలామంది అతిథులు బ్రాహ్మణులు వచ్చారు. మీ ఉంగరాన్ని బరిణిలో ఉంచి పెట్టిలో భద్రముగా దాచి పెట్టాను. ఇప్పుడు పెట్టి వెదకి చూడడానికి సమయం లేదు కాని భోజనం చేసిన తరువాత నేను తెస్తాను. అన్న సోమిదమ్మ మాటల ద్వారా ఆమె యొక్క మాట నేర్పరితనంను గ్రహించాము.

చ. అరుణ గభస్తిబింబ ముదయాద్రిపయిం బొడతేర గిన్నెలోఁ
బిరుగును వంటకంబు వడపిందియలుం గుడువంగఁ బెట్టుని
ర్భర కరుణా ధురీణయగు ప్రాణము ప్రాణము తల్లి యున్నదే ?
హర హర ! యెవ్వరింకఁ గడు పారసిపెట్టెద రీప్సితాన్నముల్

దుర్వ్యసనాలకు పాల్పడి తల్లి దండ్రులను దూరం చేసుకున్న గుణనిధికి తన ఆకలిని తెలుసుకొని అన్నంపెట్టే అమ్మ ప్రేమతత్వాన్ని గ్రహించే సరికి తల్లి దూరం కావడంతో ఆకలి బాధతో పశ్చాత్తాపపడుతున్న గుణనిధి పాత్ర ద్వారా దుర్వ్యసనాలకు పాల్పడితే చివరికి ఏమి జరుగుతుందో విద్యార్థులమైన మేము గ్రహించగలిగాము.

## నారద గానమాత్సర్యం :

" స్పర్థాయ వర్ధతే విద్య "

పోటీ వల్ల విద్య వర్ధిల్లుతుంది అనే నానుడికి ప్రబల ఉదహారణంగా నారద గానమాత్సర్యంలో గ్రహించవచ్చు.

తుంబురుని గొప్పతనాన్ని గుర్తించకముందు నారదునిలో కలిగిన మాత్సర్యం ఈ నాటికి సగటు మనిషిలోను గోచరిస్తుంది.

సీ. తనుఁ గ్రమ్మఱంగఁ బిల్చిన వేళయంద నా
తో విచారింపక పోవుటెట్లు ?
పోయెఁబో ననుఁ బిల్వఁ జేయక తానొక
నెఱజాణయై విద్య నెఱపుటెట్లు ?
నెఱపెఁ బో ప్రభువు మన్నించినాఁడని మఁదు
పరికింప కీ సొమ్ము పట్టుటెట్లు ?
పట్టెఁబో దొంగఁ దేల్గట్టినట్టివి డాఁచి
కంచుఁ బోవక మెఱయించుటెట్లు ?

విష్ణుమూర్తి సభకు తుంబురుని మరల పిలిపించినపుడు తుంబురుడు నారదునికి చెప్పకుండా వెళ్ళాడు. పోనీ వెళ్ళినవాడు నారదుని కూడా పిలిపించాలి. అలా కాకుండా తుంబురుడు ఒక్కడే వెళ్ళి విద్యను ప్రదర్శించాడు. ఇలా విద్యను ప్రదర్శించడం ఎంతవరకు న్యాయం కాదు అని పోని ప్రదర్శించాడు. ప్రభువు గౌరవించాడు కదా అని ముందు ఆలోచించక బహుమతులు స్వీకరించడం , స్వీకరిస్తే స్వీకరించాడు వాటిని దాచుకొని వెళ్ళక అందరి ముందు ప్రదర్శించడం ఏమి దర్మము ? అని నారదుడు లోలోపల పశ్చాత్తాపపడుతాడు. అట్లాగే తుంబురునిపై కూడ అసూయ కలిగింది. ఇలా తుంబురునిపై నారదునికి అసూయ కల్గుటకు కారణాలు పై అంశాలను ఈ పద్యం ద్వారా గ్రహించాము. ఎంత గొప్పవారమైన ఎదుటివారికి అసూయ కలిగే విధంగా ప్రవర్తించకూడదు అనే విషయాన్ని గ్రహించాము. అట్లాగే విద్యా విషయంలో నారదుడి వలె అసూయ, పట్టుదల ఉండాలని గ్రహించాము.

మ. 'కదుఁబ్రావీణ్య ధురీణుఁడీతఁ డయినన్ గాంధర్వ సంపూర్తినె

ల్లెడఁబ్రఖ్యాతి వహించు నాకు సకటా! యీ తుంబురుండింతయె

క్కుడుగా గానము నేఁటిదాఁక నని సంక్షోభించుచున్ దాఁడీద

నెన్నడు దానిందలఁదన్నువాఁడు గలడన్వేపింప నంచెంచితిన్

ఈ పద్యంలోని నారదుని కంటె తుంబురుడు నేర్పుగలవాడే అయినా ఎప్పుడు కూడా బయట ఎక్కువ ప్రదర్శన కనబరచలేదు. కావున అప్పటివరకు నారదుడే పేరు పొందిన గాన విద్వాంసునిగా నారదుడు సగర్వంగా చెప్పుకునేవాడు. గాన విద్యయందు నా కంటే విద్వాంసులు ఎవరు లేరని భావించేవాడు. తుంబురుని గానం విష్ణుమూర్తి సభలో వినిపించినప్పటినుండి నారదునికి తాడిని తన్నగల వాడి తలను తన్నగలవాడు ఉంటాడని అర్థం అవుతుందని. ఈ పద్యం ద్వార ఎవ్వరిని చిన్న చూపు చూడకూడదు అని మనమే గొప్ప అని ఎప్పటికి గర్వంగా ఉండకూడదనే సందేశంను విద్యార్థులమైన మేము గ్రహించడం జరిగింది. ఇది వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడుతుంది.

క. తమ విద్య, నెవ్వరే మా

త్రముగనఁ జాలుదురు వారి దండను దన్మా

త్రము ప్రకటింతురు బుధు; లు

త్తముల మహిమ నిరుకొలది తామర సుమ్మీ !

ఈ పద్యం ద్వారా పండితులు గ్రహించే వారి సామర్థ్యాన్ని బట్టి , ఆసక్తిని బట్టి తమ విద్యా పాండిత్యాన్ని ప్రదర్శిస్తారని, బోధిస్తారని విద్యార్థులుగా మేము గ్రహించడం జరిగింది. కావున విద్యార్థులకు విద్య పట్ల ఆసక్తి ఉండాలని సందేశం. అట్లాగే ఈ పద్యంలో  వినేవారి శక్తికి మించి విద్యను ప్రదర్శిస్తే అది చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు వ్యర్థమవుతుందని ఉత్తమ పండితులు గ్రహించేవారి సామర్థ్యం, విద్య అభ్యసన పట్ల ఆసక్తిని బట్టి విద్యను ప్రదర్శిస్తారని మేము గ్రహించాము.

## నారసింహ శతకం :

సీ. పసరంబు వంజైన బసులకాపరి తప్పు
ప్రజలు దుర్జనులైన ప్రభుని తప్పు
భార్య గయ్యాళైన బ్రాణనాథుని తప్పు
తనయుడు దుష్టయిన తండ్రి తప్పు
సైన్యంబు చెదరిన సైన్యనాథుని తప్పు
కూఁతురు చెడుగైన మాత తప్పు
అశ్వంబు చెడుగైన నారోహకుని తప్పు
దంతి దుష్టయిన మా వంతు తప్పు

తే. ఇట్టి తప్పు లెరుంగక ఇచ్చవచ్చి
నటుల మెలఁగుదు రిప్పుడీయవనిజనులు
భూషణ వికాస ! శ్రీ ధర్మపుర నివాస !
దుష్టసంహార ! నరసింహ దురితదూర !

ఈ పద్యం ద్వారా విద్యార్థులమైన మేము గ్రహించింది ఏమంటే పశువులకైనా, మనుషులకైనా పోషకులు సంరక్షకులు పాలకులు మంచి వారైతేనే వరిని ఆదారపడ్డ జీవులు మానవులు తప్పులు చేయకుండా ఉంటారని మనుష్యులు ఇటువంటి తప్పులు తెలిసికోకుండా ఈనాడు తమకు ఇష్టం వచ్చినట్లు సంచరిస్తున్నారని గ్రహించాము. అట్లాగే విద్యార్థులు తప్పు చేస్తే విద్యార్థి తల్లిదండ్రుల పోషణ విధానంలో తప్పు ఉంటుందని బయటి సమాజం భావిస్తుంది అనే విషయాన్ని మేము గ్రహించాము. కావున విద్యార్థులు తల్లిదండ్రులకు , ఉపాధ్యాయులకు గొప్ప పేరు తీసుకురావటానికి విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తీసుకురావటానికి ఈ పద్యం తోడ్పడుతుందని , వ్యక్తిత్వ నిర్మాణాన్ని పెంపొందించేలా ఉందని గ్రహించాము. అట్లాగే నైతిక విలువలు పెంపొందిస్తుంది.

సీ. తల్లి గర్భమునుండి ధనము తేఁడెవ్వడు
వెళ్ళిపోయెడినాఁడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెఱఁగు బంగారంబు మ్రింగబోఁడు
విత్తమార్జనఁజేసి విఱ్ఱవీఁగుటె కాని
కూడఁబెట్టిన సొమ్ము తోడరాదు
పొందుగా మఱుఁగైన భూమి లోపలఁ బెట్టి
ధానధర్మము లేక దాఁచి దాఁచి

తే. తుదకు దొంగలకిత్తురో దొరల కవునో
తేనె జుంటీఁగ లియ్యవా తెరువరులకు ?
భూషణ వికాస ! శ్రీ ధర్మపుర నివాస !
దుష్ట సంహార ! నరసింహ దురితదూర !

తల్లి కడుపు నుండి పుట్టినపుడు ధనమును ఎవ్వడూ తీసుకొని రాడు. చనిపోయినపుడు వెంట తీసుకెళ్ళరు. ధనవంతుడైనా ఉప్పు మెతుకులే తింటాడు కాని బంగారం తినడు. ధనవంతులు దాచిన సొమ్ము దొంగలకే రాజుల పాలవుతుందో మంచి మేలు జరుగుతుంది. పేరు ప్రతిష్టలు ఉంటాయి. పేదవారు కూడా అభివృద్ధి చెందుతారు.కాబట్టి జీవించినంత కాలం ధనం ఉన్నదని గర్వపడకుండా అందరితో కలిసి మెలిసి జీవిస్తూ తోటి వారికి తోచినంత సహాయ సహకారాలు చేస్తూ కలిసి జీవించాలనే సందేశాన్ని మేము ఈ పద్యాల ద్వారా గ్రహించడం జరిగింది. ఈ పద్యాల ద్వారా నైతిక విలువలు వ్యక్తిత్వ నిర్మాణం పెంపొందుతాయి.

## నివురు తొలగిన నిప్పు :

" నివురు తొలగిన నిప్పు " అనే కథను వోల్కంపల్లి శాంతాదేవి చక్కగా సందేశాన్ని అందించేలా వ్రాసింది.

చీకటిలో ఉన్న మనిషి బతుకంతా చీకటి అనుకుంటే అసలు బ్రతుకలేడు. ప్రయత్నిస్తే అతడి జీవితంలో వెలుగు వస్తుందని ఈ కథ సందేశం ఇస్తుంది.

లాయరమ్మలా భర్త మరణించినా స్త్రీలు కష్టపడి పిల్లలను చదివిస్తే వారి జీవితాలలో వెలుగు వస్తుందని ఈ కథ సందేశం. కష్టాలలో ఉన్న రమణను, వేళా కోళం చేసిన లాయరు, పక్క ఇంటి అమ్మాయి సవిత అలాగే పాలు అమ్ముకునే సీతమ్మ. రమణ కలెక్టర్ అవుతాడని తెలిసి తాము చేసిన పనికి పశ్చాత్తాప పడ్డారు. దీనిని బట్టి ఉన్నవారు కష్టాలలో ఉన్న వారిని సాను భూతితో ఆదుకోవాలని ఈ కథ సందేశం.

ఈ కథలో జీవితం కనిపిస్తుంది. ఈ కథ జీవన సత్యాలనుఆవిష్కరిస్తుంది. అభిమానవంతుడైన రమణ లక్ష్యం వైపుకు చేసిన ప్రయాణం పాఠకులకు, విద్యార్థులకు మంచి స్ఫూర్తినిస్తుంది. పేదరికంలో వచ్చిన కష్టాలను ఆత్మవిశ్వాసంతో పట్టుదలతో ఎదురించవచ్చని ఈ కథ ద్వారా మేం గ్రహించాము. సహాయం చేసిన వారిని ఎదిగిన తర్వాత మరువరాదని కృతజ్ఞత బావాన్ని జీవితాంతం నిలుపుకోవాలని ఈ పాఠం ద్వారా గ్రహించాము.

## ముగింపు :

విద్యార్థులుగామేము అధ్యయనం చేసిన పాఠ్యాంశాలలో విద్యార్థుల మనోవికాసాన్ని వ్యక్తిత్వనిర్మాణాన్ని మాట నేర్పరితనాన్ని మొదలైన అంశాలను తెలియజేసే పాఠ్యాంశాలుగా మేము గ్రహించగలిగాము. అధ్యాపకుల బోధనలోని విషయాలను గ్రహిస్తూనే డిగ్రీ స్థాయిలో తెలుగును ద్వితీయ భాషగా మాత్రనే బావించి చదివితే కేవలం మార్కులే వస్తాయని అలా కాకుండా వ్యక్తిత్వ నిర్మాణ సంబంధ అంశాలను అన్వేషిస్తూ అధ్యయనం చేస్తే విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయుక్తమయ్యే ఎన్నో విషయాలను గ్రహించే అవకాశం ఉందని మాకు జిజ్ఞాస ప్రాజెక్టులో భాగంగా మేము గ్రహించిన " డిగ్రీ తెలుగు పాఠ్యాంశాలు- వ్యక్తిత్వ నిర్మాణం ' శీర్షిక ఆధారంగా పైన పేర్కొన్న అంశాలను విశ్లేషించగలిగాము.

## సేకరించిన పుస్తకాలు :

1. తెలుగు సాహితీ మంజీర (డిగ్రీ ప్రథమ సంవత్సరం )
2. తెలుగు సాహితీ కిన్నెర (డిగ్రీ రెండవ సంవత్సరం )